సాక్షి
మెదక్
బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



అమృత్.. ఆలస్యం

జహీరాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

మహబూబ్ సాగర్ చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను కలెక్టర్ క్రాంతి పరిశీలించారు.

వివరాలు 8లో ▸



సద్వినియోగం చేసుకోవాలి

పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు.

వివరాలు 8లో ▸

మాది సుపరిపాలనే



ప్రసంగిస్తున్న కోదండరెడ్డి



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కోదండరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్

- ప్రజాపాలన దినోత్సవంలో రైతు సంక్షేమ రాష్ట్ర కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

మెదక్‌జోన్: ఎంతోమంది అమరుల ప్రాణత్యాగం వల్లే 2014 జూన్ 2న స్వరాష్ట్రం సిద్ధించిందని, ఈ పోరాటాల్లో ప్రాణాలొదిలిన వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా మంగళవారం మెదక్ కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజన్నారు. భారత దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధిస్తే తెలంగాణ మాత్రం నిజాం రాచరిక పాలన విముక్తి కోసం పోరాడిందన్నారు. అలా 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు స్వేచ్ఛా వాయువులు లభించాయన్నారు.

అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే...

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల నుండే ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాపాలనపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. ఇందిరమ్మ గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

1.31 కోట్ల మంది మహిళలకు రూ.38.78 కోట్ల లబ్ధి

మహాలక్ష్మి పథకం కింద ఉచిత ఆర్టీసీ బస్సుల్లో జిల్లాలో 1.31 కోట్ల మంది మహిళలు ప్రయాణించి రూ.38.78 కోట్ల లబ్ధి పొందారన్నారు. అలాగే రాజీవ్ ఆరోగ్య బీమా పథకం గతంలో రూ. 5 లక్షలు ఉంటే రూ. 10 లక్షలకు పెంచామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 10,722 మంది లబ్ధిపొందగా ప్రభుత్వం రూ. 25.6 కోట్లు ఖర్చు చేసిందన్నారు. సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్లు నిర్మించనుందన్నారు. గృహలక్ష్మి కింద రూ. 500లకే వంట గ్యాస్ ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 1,22,672 మంది లబ్ధిదారులకు 2,53,125 సిలిండర్లు అందించామన్నారు. తద్వారా రూ. 7.18 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశామన్నారు. గృహజ్యోతి పథకం 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ వల్ల జిల్లాలో 1,24,370 మందికి లబ్ధిచేకూరిందన్నారు. రుణ మాఫీ కింద జిల్లాలో 86,919 మంది రైతులకు రూ. 638.9 కోట్ల మాఫీ జరిగిందన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖను విచ్ఛిన్నం చేసిన కేసీఆర్

మాజీ సీఎం కేసీఆర్ రెవెన్యూ శాఖను పూర్తిగా విచ్ఛిన్నం చేశారని, లక్షలాది ఎకరాల భూములను పార్ట్(బీ)లో పెట్టి పేద రైతులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భూ ప్రక్షాళన పేరుతో రెవెన్యూ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. 2020లో ఆర్ఓఆర్ చట్టం తెచ్చి రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూములను పార్ట్(బీ)లో పెట్టడంతో అర్హులైన ఎంతో మంది సన్న, చిన్న కారు రైతులు నేటికి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ధరణిలోపాలను సరిచేసేందుకు సీఎం కమిటీని వేశారన్నారు.

విశ్వకర్మ జయంతి

మెదక్ కలెక్టరేట్: విశ్వకర్మ దైవిక వాస్తుశిల్పి అని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. మంగళవారం సమీకృత కార్యాలయంలో ఆయన జయంతి వేడుకల్లో ఆయన, ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఉదయ్ కుమార్, అడిషనల్ ఎస్పీ మహేందర్ పాల్గొన్నారు.



ఆస్పత్రిలో హాజరు రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ముగ్గురు వైద్య సిబ్బందిపై వేటు

- రిజిస్టర్‌లో సంతకం చేసి విధులకు డుమ్మాపై కలెక్టర్ ఆగ్రహం

కౌడిపల్లి(నర్సాపూర్): రిజిస్టర్‌లో సంతకం చేసి విధులకు డుమ్మా కొట్టిన ముగ్గురు వైద్య సిబ్బందిపై మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ వేటు వేశారు. మంగళవారం పీహెచ్‌సీ, సీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. రిజిస్టర్‌లో సంతకం చేసి అనుమతి లేకుండా గైర్హాజరు అయిన ఎంపీహెచ్ఎస్‌లు రమేశ్, రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ అబ్దుల్ షకీల్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం ఓపీ, ల్యాబ్, కంప్యూటర్ వర్క్, మందుల పంపిణీ, రోగుల గది, ఇంజక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. రోగులకు నిలబెట్టి ఇంజక్షన్ చేస్తున్నారని, చికిత్స సరిగా చేయడం లేదని, ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వైద్యసిబ్బందిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ''రోగుల కోసం మనం ఉన్నామని.. వాళ్లు వస్తున్నారు కాబట్టే మనకు జీతాలు ఇస్తున్నారని, లేకుంటే మనం ఇక్కడ ఎందుకు ఉన్నట్లు''అని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వారం తర్వాత మరోసారి తనిఖీకి వస్తానని, పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మహిళా క్లీనిక్ సేవలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఫెర్నాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీతో మరింత అభివృద్ధి

- బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

జహీరాబాద్: జహీరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని ప్రకటించిందని, దీంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుందని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు. మంగళవారం జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నరేంద్రమోదీ పాలనతో సంతోషంగా ఉన్న ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని తీసుకునేందుకు ముందుకు వస్తున్నారన్నారు. దీంతో లక్ష్యానికి మించి సభ్యత్వం నమోదు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి కేంద్రం.. ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని ప్రకటించినందుకు మరింత అభివృద్ధి చెందనుందన్నారు. పారిశ్రామిక ఉత్పాదక మండలి (నిమ్జ్)ని ఏర్పాటు చేయడం వల్ల పారిశ్రామికంగా ఊహించనంతగా రూపొందనున్నట్లు పేర్కొన్నారు. వీటి ఏర్పాటు వల్ల రాష్ట్రం సైతం అభివృద్ధి చెందనుందన్నారు. తెలంగాణ విమోచన దినాన్ని పార్టీ పరంగా అన్ని ప్రాంతాల్లో నిర్వహించారన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎన్.జగన్నాథ్, పార్టీ నాయకులు జి.భాస్కర్, విజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, సుధీర్ భండారి, సోమ అనిల్ పాల్గొన్నారు.

సాయుధపోరాట వారసులు కమ్యూనిస్టులే

- సీపీఎం రాష్ట్ర కమిటీ నేత భూపాల్

చేగుంట(తూప్రాన్): తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకుడు భూపాల్ అన్నారు. మంగళవారం పొలంపల్లి శివారులోని కామ్రేడ్ కేవల్ కిషన్ సమాధి వద్ద తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ నాటి నిజాం అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడి వారిని ఓడించింది కమ్యూనిస్టులేనని అన్నారు. జిల్లాలోని కార్మిక, కర్షక, రైతాంగం సమస్యలపై సీపీఎం తరపున నిరంతరంగా పోరాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లేశం, బస్వరాజు, సంతోశ్, లక్ష్మీనర్సయ్య, బాలమణి, నాగమణి, రాజుతో పాటు పలు గ్రామాల రైతులు కార్మికులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు రెండు ప్రాజెక్టులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి 9 ప్రాజెక్టులను పంపామని పేర్కొన్నారు. జాతీయ స్థాయికి మొత్తం 26 ప్రాజెక్టులను ఎంపిక చేశారని తెలిపారు. వీటిలో జెడ్పీహెచ్ఎస్ కసాన్‌పల్లి విద్యార్థి స్రవంతి రూపొందించిన సులభంగా డెస్క్‌లను శుభ్రపరిచే యంత్రం, జెడ్పీహెచ్ఎస్ కవేలి 10వ తరగతి విద్యార్థి మహ్మద్ ముస్తఫాఅహ్మద్ రూపొందించిన వీధి దీపాలను మార్చే యంత్రం ప్రాజెక్టులు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. జిల్లా నుంచి ఇవి ఎంపిక కావడంపై డీఈఓ హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 17 నుంచి 19 వరకు ప్రగతి మైదాన్ న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్‌లు సిద్దారెడ్డి, ఎలిజబెత్ రాణిలను సైతం డీఈఓ అభినందించారు.

బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల, కాలేజీల ప్రిన్సిపాల్స్

నర్సాపూర్: జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు పాఠశాల, కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారని అల్లూరి సీతారామరాజు గిరిజన బాలుర గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ బల్‌రాం తెలిపారు. ఈనెల 14 నుంచి 16 వరకు నిర్మల్‌లో 5వ తెలంగాణ బేస్‌బాల్ ఇంటర్ డిస్ట్రిక్ రాష్ట్ర స్థాయి జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయని పేర్కొన్నారు. ఇందులో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థాయి బహుమతులు గెలుపొంది, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. కాగా జాతీయ స్థాయి పోటీలు అక్టోబర్ 1 నుంచి 6 వరకు పంజాబ్‌లో జరుగుతాయని తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను, అందుకు కృషి చేసిన పీడీ లక్ష్మణ్‌ను ఉపాధ్యాయులతో పాటు కాలేజీ ప్రిన్సిపాల్ బల్‌రాం, పాఠశాల ప్రిన్సిపాల్ రవి అభినందించారు.

శమ్నాపూర్ ఘటనపై జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ జిల్లా హవేళి ఘణాపూర్ పరిధిలోని శమ్నాపూర్ గ్రామ వినాయకుడికి కొబ్బరికాయ కొట్టడానికి వెళ్లిన దళిత మహిళలను అవమానించిన సంఘటనపై దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) సోమవారం జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇందుకు స్పందించిన కమిషన్ మెదక్ జిల్లా ఎస్పీ, కలెక్టర్‌లకు నోటీసులు జారీ చేసిందని జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, హన్మకొండ దయాసాగర్‌లు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను తక్షణమే తమకు సమర్పించాలని ఆదేశించిందన్నారు. నిందితులపై చర్యలు తీసుకొని బాధితులకు రక్షణ కల్పించాలని ఆదేశించిందని తెలిపారు.

ఏడుపాయల టెండర్లు వాయిదా

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో మంగళవారం నిర్వహించాల్సిన టెండర్లు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. దేవస్థానానికి చెందిన 9 షాపుల్లో చట్టబద్ధమైన వ్యాపారం నిర్వహించడానికి, మొబైల్ ఫొటోలు తీయడానికి, తలనీలాలు పోగు చేయడానికి సీల్డ్, బహిరంగ వేలాలు నిర్వహించడానికి ఈ నెల 2న పత్రికా ప్రకటన చేశామన్నారు. అనివార్య కారణాల వల్ల ఆ టెండర్లు వాయిదా వేశామన్నారు.

దుర్గమ్మకు పల్లకీ సేవ



పల్లకీ సేవలో భక్తులు

పాపన్నపేట(మెదక్): తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వనదుర్గమ్మకు మంగళవారం పౌర్ణమి పురస్కరించుకొని పల్లకీ సేవ నిర్వహించారు. మొదట అర్చకులు శంకరశర్మ, పార్థివశర్మ మూలవిరాట్ మాతను అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ముస్తాబు చేసి, పల్లకీపై కూర్చోబెట్టారు. బ్రాహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుండగా, దుర్గామాతకు జై అంటూ భక్తులు పల్లకీ సేవ ప్రారంభించారు. గర్భగుడి నుంచి రాజగోపురం వరకు సేవ కొనసాగించారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



జహీరాబాద్‌టౌన్: తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్/సంగారెడ్డి రూరల్: తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు తెలంగాణ తల్లి చిత్రపటానికి, సంగారెడ్డిలోని కలెక్టరేట్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మాణిక్‌రావు తన క్యాంప్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లిని ప్రభుత్వం అవమానిస్తోందన్నారు. తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం వల్ల ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ ఇంకా ఎంతోమంది మేధావుల విగ్రహాలను పెట్టకుండా రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఆయా కార్యక్రమాల్లో సీడీసీ మాజీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, నర్సింహులు, పార్టీ నాయకులు గుండప్ప, మోహియోద్దీన్, పెంటారెడ్డి, సంజీవ్‌రెడ్డి, మచ్చేందర్, బండి మోహన్, అశోక్‌రెడ్డి, రాకేశ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అల్మాయిపేటలో మద్యం నిషేధించండి

ఎక్సైజ్ సీఐకి గ్రామస్తుల వినతి

జోగిపేట(అందోల్): సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని అందోల్ మండలం అల్మాయిపేట గ్రామస్తులు కోరారు. మంగళవారం జోగిపేట ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ సాగర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆగస్టు 15, 25వ తేదీల్లో మద్యపాన విక్రయం నిషేధిస్తూ ఏకగ్రీవంగా గ్రామంలో తీర్మానించామన్నారు. అయినా యథావిధిగా విక్రయాలు జరుగుతున్నాయన్నారు. ఈనెల 10 నుంచి సంపూర్ణంగా మద్యం విక్రయాలు నిలిపి వేయాలని, అంతకు ముందు రోజు కూడా తీర్మానం చేసి విక్రయదారుల నుంచి సంతకాలను సేకరించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో పూర్తిగా విక్రయాలు నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని సీఐను కోరారు. సీఐ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్లేట్ లెట్స్ సేకరణ యంత్రం ప్రారంభం



వ్యక్తి నుంచి ప్లేట్‌లెట్లు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

సంగారెడ్డి: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్లేట్ లెట్స్ సేకరణ యంత్రం సేవలు మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ మాట్లాడారు. మనిషికి డెంగీ జ్వరం వచ్చినప్పుడు తెల్లరక్త కణాలు తగ్గిపోతాయన్నారు. ఇంకో వ్యక్తి నుంచి వీటిని సేకరించి నిల్వ చేయడానికి ఈ యంత్రాన్ని వినియోగిస్తామన్నారు. ప్రస్తుతం ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ ప్లేట్ లెట్స్‌లు ఐదు రోజుల వరకు వినియోగించుకోవచ్చొన్నారు. కాగా తెల్లరక్త కణాలు ఇచ్చిన దాత విజయ్‌ను అభినందించారు. బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాజు, మోహన్ వైద్యులు పాల్గొన్నారు.

గణనాథుడికి 108 రకాల నైవేద్యం



గణనాథుడికి 108 రకాల నైవేద్యాలను బాయ్స్ యూత్ సభ్యులు, కాలనీ వాసులు సమర్పించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గజానన్ సేవా సదన్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో గొల్లకేరిలో ఏర్పాటు చేసిన వినాయకుడు విశేష పూజలు అందుకుంటున్నాడు. అందులో భాగంగా భక్తులు తెచ్చిన ప్రసాదాన్ని అర్చకులు పూజలు చేసి పంపిణీ చేశారు.

– సదాశివపేట రూరల్ (సంగారెడ్డి):



సంగారెడ్డి జోన్: శోభాయాత్రలో నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రజారోగ్యంపై కల్తీ కాటు

- పాడైన తినుబండారాలు, కల్తీ వస్తువుల విక్రయం
- గడువు తీరిన వస్తువులు సైతం..
- రోగాలబారిన జనం
- తూతూమంత్రంగా తనిఖీలు



నర్సాపూర్‌లో ఓ దుకాణంలో బూజు పట్టిన పిండి పదార్థాలు విక్రయించిన దుకాణదారుడు

నర్సాపూర్: పట్టణంలో పలువురు వ్యాపారులు కల్తీ, గడువుతీరిన, పాడైన తినుబండారాలను విక్రయిస్తున్నారని విమర్శలున్నాయి. ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ శాఖ అధికారులు సంయుక్తంగా తినుబండారాల దుకాణాలను తనిఖీలు చేస్తూ తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పలు రకాల తినుబండారాలు పాడైన విషయం తెలియక కొనుగోలు చేస్తున్నారు. వాటిని తిన్న తర్వాత ప్రజలు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి.

కాగా, తినుబండారాలను తయారు చేసిన కంపెనీ పేరు, గడువు తేదీ, ప్యాకెట్లపై కచ్చితంగా నమోదు చేయాల్సి ఉండగా అనేక రకాల తినుబండారాలపై అవేవి కన్పించడం లేదు. నర్సాపూర్‌లోని పలు బేకరీలు, హాట్‌చిప్స్, ఇతర దుకాణాల నిర్వాహకులు నిబంధనల మేరకు ఎలాంటి వివరాలు లేని వస్తువులను విక్రయిస్తున్నారు. సరైన వివరాలు లేని వస్తువులు అమ్ముతున్నా.. ఏ శాఖ అధికారి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కాగా నాన్ వెజ్‌టేరియన్ స్నాక్స్ విక్రయించే వ్యాపారులు రాత్రి పూట మిగిలిన మాంసాన్ని నిల్వ ఉంచి మర్నాడు అదే మాంసంతో స్నాక్స్ తయారు చేసి విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

అడ్డగోలుగా మాంసం విక్రయాలు

నర్సాపూర్ మున్సిపాలిటీతో పాటు, నియోజకవర్గ కేంద్రం కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇక్కడి దుకాణాల్లోనే మాంసం కొనుగోలు చేస్తున్నారు. దీంతో నాన్ వెజ్‌టేరియన్ మార్కెట్‌కు బాగా డిమాండ్ ఉంటుంది. మేకలు, కోళ్లను పరీక్షించాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఎవరూ పట్టించుకోకపోవడంతో అస్వస్థతకు గురైన కోళ్ల మాంసం విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారి మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఒకే అధికారి కావడంతో ఆయన నర్సాపూర్‌లో తనిఖీలు చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి. కాగా మున్సిపాలిటీ అధికారులు నర్సాపూర్‌లోనే విధులు నిర్వహిస్తున్నప్పటికీ తినుబండారాలు, మాంసం దుకాణాలను తనిఖీ చేయకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. గడువు తీరి పాడైన తినుబండారాలు, నాణ్యత లేని మాంసం విక్రయదారులపై చర్యలు తీసుకుని నాణ్యమైన తినుబండారాలు, మాంసం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తార్యానాయక్ వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులో రాలేరు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> పట్టణంలోని ఆయా దుకాణాలలో తనిఖీలు చేస్తామని మున్సిపల్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎరువుల దుకాణం తనిఖీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సుభాష్ గంజ్‌లో మల్లికార్జున ఫర్టిలైజర్ దుకాణాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారి లావణ్య తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్‌లతో పాటు పెస్టిసైడ్ శాంపిల్స్ సేకరించారు. నాణ్యత ప్రమాణాల నిర్ధారణ కోసం శాంపిల్స్‌ను టెస్టింగ్ కోసం హైదరాబాద్‌లోని లేబరేటరికి పంపుతున్నట్లు చెప్పారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్స్‌గా పనిచేసేందుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మెదక్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, రామాయంపేట డిగ్రీ కళాశాలలో గణితం, భౌతికశాస్త్రం సబ్జెక్టుల్లో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పీజీ 55 శాతం మార్కులతో పూర్తి చేసి ఉండాలన్నారు. అలాగే నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. 20న ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని డెమో క్లాసుకి హాజరు కావాలన్నారు.

క్లుప్తంగా

రుణమాఫీ కాలేదని ఆందోళన వద్దు

రైతులకు ఎమ్మెల్యే రోహిత్‌ విజ్ఞప్తి



గ్రామస్తులతో మాట్లాడుతున్న రోహిత్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): రైతు రుణమాఫీ విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని మెదక్‌ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ కోరారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలో గణేశ్‌ పూజకు హాజరై గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు తమకు రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యేకు వివరించారు. రూ.2 లక్షల వరకు ప్రభుత్వం రుణమాఫీ చేపట్టిందన్నారు. సాంకేతిక సమస్యలు ఉన్న రైతులకు కూడా త్వరలోనే రుణమాఫీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కొర్విపల్లి గ్రామ నాయకులు పుల్లారావు, మల్లేశం, రామచందర్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, రాజిరెడ్డి, మోహన్‌నాయక్‌, గోవర్దన్‌, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌లో కన్‌సాన్‌పల్లి విద్యార్థిని



ఇన్‌స్పైర్‌ నమూనాతో స్రవంతి, టీచర్‌ సిద్దేశ్వర్‌

వట్‌పల్లి(అందోల్‌): అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి చాకలి స్రవంతి మంగళవారం జరిగిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల గదులను సులభంగా శుభ్రం చేసే యంత్రం నమూనాను ఇటీవలె జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌లో ప్రదర్శించగా జాతీయ స్థాయికి ఎంపికైంది. మూడు రోజుల పాటు ఢిల్లీ ప్రగతి మైదానంలో జరుగనున్న జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌ మంగళవారం ప్రారంభం కాగా స్రవంతి పాల్గొని తన నమూనాను ప్రదర్శించినట్లు గైడ్‌ ఉపాధ్యాయులు సిద్దేశ్వర్‌ తెలిపారు.

లక్ష్య సాధనకు పాటుపడాలి



ప్రజాపాలన వేడుకలో అధ్యాపకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్‌ : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ కె.ఎస్‌ రత్న ప్రసాద్‌ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. సెప్టెంబర్‌ 17, 1948న హైదరాబాద్‌ సంస్థానం భారతదేశంలో విలీనమైందన్నారు. 2014లో తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత మొట్ట మొదటిసారిగా ప్రజా పాలన దినోత్సవం పేరట తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరుపుకోవడం జరిగిందన్నారు. నేటి యువత ఏ లక్ష్యంతో తెలంగాణ ఏర్పడిందో ఆ లక్ష్య సాధన కోసం పాటుపడుతూ ప్రభుత్వానికి సహకారాన్ని అందిస్తూ ముందుకు సాగినప్పుడే తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో ఉన్నత స్థాయిలో అభివృద్ధిని సాధించగలదని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

టీజీఐఐసీ చైర్‌ పర్సన్‌ నిర్మలా రెడ్డి

సంగారెడ్డి రూరల్‌: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి జరుగుతుందని టీజీఐఐసీ చైర్‌ పర్సన్‌ నిర్మలా రెడ్డి అన్నారు. ప్రజాపాలన సందర్భంగా సంగారెడ్డి లోని కాంగ్రెస్‌ కార్యాలయంలో మంగళవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మనకు నిజాం పాలన నుంచి విముక్తి కలిగి నేటికీ 76 ఏళ్లు పూర్తి అవుతుందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందన్నారు.





విద్యార్థి మొహంపై పెయింటింగ్‌ వేస్తున్న డాక్టర్‌ పూజిత, ఫేస్‌ పెయింటింగ్‌ పోటీల్లో వైద్య విద్యార్థులు

వైద్య కళాశాలలో వార్షిక సందడి

ఫేస్‌ పెయింటింగ్‌తో అదరగొట్టిన విద్యార్థులు

సిద్దిపేటకమాన్‌: సిద్దిపేట ప్రభుత్వ మెడికల్‌ కళాశాలలో 'కళాశాల ఫెస్ట్‌' పేరుతో వైద్య విద్యార్థులు సందడి చేశారు. ప్రభుత్వ మెడికల్‌ కళాశాలలో 2020 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థుల (డ్రావెన్‌ కోర్స్‌) ఆధ్వర్యంలో 'ఉద్భవ్‌ పేరు'తో కళాశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. 13వ తేదీన ప్రారంభమైన వార్షికోత్సవం 21వ తేదీ వరకు కొనసాగనుంది. మొదటి రోజు హెల్త్‌ రన్‌, ఫ్లాష్‌ మాబ్‌, 14,15,16వ తేదీల్లో విద్యార్థులు, ఫ్యాకల్టీకి పలు రకాల ఇండోర్‌, అవుట్‌డోర్‌ పోటీలు నిర్వహించారు. 17న మంగళవారం కళాశాలలో ట్రెడిషనల్‌ డేలో భాగంగా రంగోలీ, మెహందీ, కైట్‌ ఫెస్టివల్‌, ఫేస్‌ పెయింటింగ్‌, పాట్‌ పెయింటింగ్‌ పోటీలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ పెయింటింగ్‌ ప్రదర్శించిన ముగ్గురిని ఎంపిక చేశారు. నేడు (బుధవారం) గ్లామ్‌ నైట్‌, సినిమాలు, ఇతర షార్ట్‌ ఫిలింలోని సన్నివేశాలను రీక్రియేట్‌ చేసి యాక్టింగ్‌ చేసి తమ టాలెంట్‌ను ప్రదర్శించనున్నారు. 19 న కాన్సెర్ట్‌ పేరుతో విద్యార్థులతో పాటల పోటీలు, 20న డ్యాన్స్‌ నైట్‌ పేరుతో డ్యాన్స్‌, 21వ తేదీన పెద్ద ఎత్తున కాలేజ్‌ యాన్యువల్‌ డే నిర్వహించనున్నారు. దీనికి ఎంబీబీఎస్‌, పీజీ వైద్య విద్యార్థులు మొత్తం 975 మంది వరకు పాల్గొనున్నారు. ఈ ఫెస్ట్‌ విజయవంతానికి కళాశాల డైరెక్టర్‌ విమలాథామస్‌ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఫేస్‌ పెయింటింగ్‌ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు, డాక్టర్లు అఖిల్‌, స్రుజన్‌, దాత్రి, మమత, రిషికేష్‌, డాక్టర్‌ విద్యప్రియ,సాయిరమ్య, వినీల, అవినాష్‌, డాక్టర్‌ జస్టి తదితరులు పాల్గొన్నారు.



అమృత్‌.. ఆలస్యం



రైల్వే స్టేషన్‌ ఆధునీకరించేందుకు కూల్చిన భవనం

- జహీరాబాద్‌ రైల్వేస్టేషన్‌ పనుల్లో తీవ్ర జాప్యం
- ఇప్పటి వరకు 10 శాతం పూర్తి
- రూ.24 కోట్ల వ్యయంతో ఏడాది కిందట ప్రారంభం
- రేకుల షెడ్ల నిర్మాణంతోనే సరి
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

జహీరాబాద్‌: జహీరాబాద్‌ రైల్వే స్టేషన్‌ అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అమృత్‌ భారత్‌ పథకం కింద అభివృద్ధి చేసేందుకు ఏడాది కిందటే పనులు ప్రారంభించినా ఇప్పటి వరకు ముందుకు సాగడం లేదు. గతేడాది ఆగస్టు 6వ తేదీన ప్రధాని మోడీ వర్చువల్‌గా దేశ వ్యాప్తంగా మొదటి విడత కింద ఎంపికైన రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అందులో జహీరాబాద్‌ రైల్వే స్టేషన్‌ ఒకటి. ఇప్పటికీ స్టేషన్‌ ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

రూ.24 కోట్లు మంజూరు..

స్టేషన్‌ను ఆధునీకరించేందుకు రూ.24 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. గతేడాది ఆగస్టులో పనులు ప్రారంభం ప్రారంభం కాగా ఇప్పటి వరకు 10 శాతం మాత్రమే పనులు పూర్తి చేశారు. మొదటి, రెండో ప్లాట్‌ఫాంలపై రేకుల షెడ్లను ఏర్పాటు చేసి మధ్యలోనే పనులను నిలిపి వేశారు. కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం చూపడం పనులు ముందుకెళ్లడం లేదని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి.



వాహనాల పార్కింగ్‌ పరిస్థితి

వ్యాపార సముదాయాలు

జహీరాబాద్‌ రైల్వే స్టేషన్‌ ఆవరణలో వ్యాపార సముదాయాల నిర్మాణాలను ఇప్పటికే చేపట్టారు. ఒకే బుకింగ్‌ కౌంటర్‌ ఉన్నందున అదనంగా మరో కౌంటర్‌ ఏర్పాటు కానుంది. ప్రస్తుతం ఒకటే ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి ఉంది. అదనంగా మరో ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిని నిర్మించనున్నారు. ఈ ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిలపైకి ఎక్కేందుకు ఎస్కలేటర్‌ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. మెయిన్‌ గేట్‌కు కుడి వైపున షాపింగ్‌ కాంప్లెక్స్‌ నిర్మాణం పనులు మందకొడిగా సాగుతున్నాయి. పనులు పూర్తి కాగానే ప్రై వేటు వ్యక్తులకు అద్దెకు ఇచ్చి ఆదాయం సమకూరేలా ప్రణాళికలు రూపొందించారు. స్టేషన్‌ ఎదుట వాహనాల పార్కింగ్‌ను సైతం నిర్మించనున్నారు. ఇందు కోసం షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కేవలం 10 శాతం మాత్రమే పనులు పూర్తి అయ్యాయి.

అంతంత మాత్రంగానే సౌకర్యాలు

ప్రస్తుతం రైల్వే స్టేషన్‌లో సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సులభ్‌ కాంప్లెక్స్‌ లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సదుపాయం లేదు. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి సదుపాయాలు కూడా ఒకటో ప్లాట్‌ఫామ్‌ వైపే ఉన్నాయి. రెండో ప్లాట్‌ఫాం వైపు ఎలాంటి వసతులు లేవు. జహీరాబాద్‌ రైల్వే స్టేషన్‌ నుంచి తిరుపతి, సికింద్రాబాద్‌, విజయవాడ, నాందేడ్‌, షిర్డీ, లాతూర్‌, వికారాబాద్‌, పూర్ణ, బీదర్‌, బెంగుళూరు, పర్లి వైజ్యనాథ్‌, ఔరంగాబాద్‌ తదితర ప్రాంతాలకు ప్రతి నిత్యం 28 రైళ్లు రాక పోకలు సాగిస్తున్నాయి. రోజు సుమారు 600 మంది వరకు ప్రయాణికులు ఈ రైళ్లలో ప్రయాణం చేస్తారు. ఇప్పటికైనా రైల్వే స్టేషన్‌ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ప్రయాణికులు కేంద్ర ప్రభుత్వం, రైల్వే అధికారులను కోరుతున్నారు.

అమృత్‌ పథకంతో కలిగే సదుపాయాలు

దేశ వ్యాప్తంగా 200 పెద్ద రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేయాలనే తలంపుతో కేంద్ర ప్రభుత్వం అమృత్‌ భారత్‌ స్టేషన్‌ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందులో రాష్ట్రంలోని 39 స్టేషన్లను ఈ పథకం కింద చేర్చారు. మొదటి దశలో 21 స్టేషన్లను చేర్చగా అందులో జహీరాబాద్‌ రైల్వే స్టేషన్‌కు చోటు లభించింది. ఉత్తర భారతదేశంతోపాటు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టింది. స్టేషన్‌లో కనీస వసతులు మెరుగు పర్చడంతో పాటు ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్లు, వెయిటింగ్‌ హాల్స్‌, ఆధునిక టికెట్‌ కౌంటర్లు, ప్లాట్‌ఫారమ్‌ల విస్తరణ, అభివృద్ధి, మోడల్‌ షాపింగ్‌మాల్‌, సులభ్‌ కాంప్లెక్స్‌లు, రెండో ఫుట్‌ ఓవర్‌బ్రిడ్జి, లిఫ్ట్‌, ఎస్కలేటర్‌ల ఏర్పాటుతో పాటు తదితర సదుపాయాలు కల్పించనున్నారు. స్టేషన్‌ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం, పరిసరాల్లో మొక్కల పెంపకం, గార్డెన్‌ నిర్మాణం, పట్టాలకు ఇరు వైపులా కాంక్రీట్‌ బాటలు రూపొందించడం, క్యాంటీన్‌ ఏర్పాటు వంటి సౌకర్యాలు ఈ పథకం కింద చేపట్టి పూర్తి చేయాల్సి ఉంది. వీటన్నింటిలో ప్లాట్‌ఫామ్‌పై రేకుల షెడ్లను నిర్మించడం తప్ప మిగితా పనులను ఇప్పటి వరకు చేపట్టలేక పోయారు. దీంతో ప్రయాణికులు వర్షం పడితే ఇబ్బందులకు గురవుతున్నారు. రైళ్ల కోసం వేచి చూసేందుకు గదులు లేక పోవడంతో అవస్థలు తప్పడం లేదు.

నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి

కలెక్టర్‌ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి : సంగారెడ్డిలోని మహబూబ్‌ సాగర్‌ చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను మంగళవారం రాత్రి కలెక్టర్‌ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌, అదనపు ఎస్పీ సంజీవ్‌ రావు పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ నిమజ్జన శోభాయాత్రలు సాఫీగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. నిమజ్జనోత్సవం నేపథ్యంలో పోలీసులు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్న తీరును నిశితంగా పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్‌, రెవెన్యూ, మున్సిపల్‌, పంచాయతీ రాజ్‌, ఫిషరీస్‌, ఫైర్‌ తదితర అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిమజ్జనోత్సవం సజావుగా జరిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్‌

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్‌ వెంకటేశ్వర్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌ వెంకటేశ్వర్లు, అధికారులు, లబ్ధిదారులు

మెదక్‌ కలెక్టరేట్‌: ప్రధాన మంత్రి ఆవాస్‌ యోజన అర్బన్‌ 2.0 పథకాన్ని అర్హులైన జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్‌ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం ప్రధాన మంత్రి మోదీ ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు పీఎం ఆవాస్‌ యోజన అర్బన్‌ 2.0 కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా ప్రారంభించారు. జిల్లాలోని సమీకృత కలెక్టర్‌ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్‌ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్‌ ఈఈ నర్సింహులు మెప్మా పీడీ ఇందిరా, మెదక్‌ మున్సిపల్‌ కమిషనర్‌ జానకీరామ్‌ సాగర్‌, సంబంధిత లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పట్టణంలో నివసించే పేదలకు, మధ్య తరగతి ప్రజలకు బాసటగా నిలిచేందుకే ఈ పథకం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నర్సాపూర్‌, తూప్రాన్‌ మున్సిపల్‌ కమిషనర్లతోపాటు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలను పట్టించుకోని ప్రభుత్వం

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

సంగారెడ్డి ఎడ్యుకేషన్‌: తెలంగాణ విమోచన వేడుకలు అధికారికంగా నిర్వహించకుండా ప్రజల ఆకాంక్షలను పట్టించుకోని కాంగ్రెస్‌ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి మండిపడ్డారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని కందిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేలాదిమంది తెలంగాణ ప్రజల వీరోచిత పోరాటంతోనే తెలంగాణకు విమోచనం లభించిందన్నారు. నిజాం రజాకార్ల మెడలు వంచి తెలంగాణ సాధించడంలో ఉక్కు మనిషి సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ పాత్ర సాహోసపేతమైందన్నారు. విమోచన వేడుకలు అధికారంగా నిర్వహించకుండా పదేళ్ల బీఆర్‌ఎస్‌, ఇప్పుడు కాంగ్రెస్‌ తెలంగాణ ప్రజలను మోసం చేశాయన్నారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ దుర్మార్గమైన రాజకీయాలను తెలంగాణ ప్రజలు తిప్పికొడతారని ఆమె స్పష్టం చేశారు.



జెండా ఎగురవేస్తున్న నాయకులు

అనంతరం ప్రధాని మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంచారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజిరెడ్డి, ఎడ్ల రమేశ్‌, రాజేశ్వర్‌ దేశ్‌ పాండే, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణఖేడ్‌ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌ రెడ్డి, వెంకట నర్సింహా రెడ్డి, పోచారం రాములు, ప్రతాపరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరి రాజశేఖర్‌ రెడ్డి, డాక్టర్‌ రాజు గౌడ్‌ జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయ్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు .

తండ్రిని చంపిన కుమారుడు

- భూమి పంచి ఇవ్వడం లేదని దారుణం
- బర్దిపూర్‌ గ్రామంలో ఘటన



మారుతీ(ఫైల్‌)

ఝరాసంగం(జహీరాబాద్‌): ఆస్తి కోసం కన్న తండ్రినే చంపాడు కుమారుడు. ఈ విషాదకర ఘటన సంగారెడ్డి జిల్లా ఝరాసంగా మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బర్దిపూర్‌ గ్రామానికి చెందిన టీ.మారుతీ(75) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి నలుగురు కుమారులు. ఇందులో రెండో కుమారుడు శ్రీనివాస్‌ కుప్పానగర్‌ గ్రామ శివారులో ఉన్న 35 గుంటల భూమిలో తన వాటా భూమి పట్టా చేసి ఇవ్వాలని తండ్రితో తరచూ గొడవ పడేవాడు. 15వ తేదీ (ఆదివారం) మరోసారి గొడవపడి పట్టా చేసి ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడు. మారుతీ రోజు మాదిరిగానే సోమవారం రాత్రి వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఇంటికి నిద్రించేందుకు వెళ్లాడు. కొద్దిసేపటికే వినాయక నిమజ్జనం పూర్తి అయ్యాక మరో కుమారుడు పొలం వద్ద నిద్రించేందుకు వెళ్లాడు. అక్కడ తండ్రి బోర్లపడి, ముఖంపై తీవ్ర గాయాలతో చనిపోయి కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. భూ తగాదాలతోనే తమ సోదరుడు తండ్రిని కొట్టి చంపినట్లు మృతుడి కుమారుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌ తెలిపారు. హత్య చేసిన కుమారుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



నర్సింహులు (ఫైల్‌)

మద్దూరు(హుస్నాబాద్‌): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య పాల్పడ్డ ఘటన మండలంలోని లద్నూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్‌ మహబూబ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన కర్రె నర్సింహులు(50) తన చిన్న కుమార్తె వివాహానికి ఇంటి మీద రూ.3.50 లక్షలు ఫైనాన్స్‌ తీసుకున్నాడు. అలాగే గ్రామంలో కొందరి వద్ద అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మస్తాపానికి గురై మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసున్నాడు. మృతుడి భార్య కనుకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి..

రామాయంపేట(మెదక్‌): రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన వెంకటాపురం శివరాంలు (39) స్థానికంగా ఉన్న హెచ్‌పీ గ్యాస్‌ గోదాంలో పని చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం ఝాన్సీలింగాపూర్‌ దారిలో రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావునాయక్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి కేసులో ఏడాది జైలు

గజ్వేల్‌రూరల్‌: యాక్సిడెంట్‌లో ఓ వ్యక్తి మృతికి కారణమైన 104 వాహన డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష పడినట్లు గజ్వేల్‌ సీఐ సైదా మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నిజాంపేట మండలం నస్కల్‌ గ్రామానికి చెందిన నత్తి సంతోష్‌గౌడ్‌ గజ్వేల్‌ 104 వాహనంపై డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2020 డిసెంబర్‌ 14న గజ్వేల్‌ నుంచి దౌల్తాబాద్‌ వైపుకు వెళ్తున్న క్రమంలో జాలిగామ గ్రామ చౌరస్తా వద్ద ఉన్న గంగళ్ల పోచయ్య(60), ముసలికాళ్ల నర్సింలు, ఆకుల నవ్యశ్రీలపైకి దూసుకురావడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ పోచయ్య మృతి చెందగా అప్పటి ఎస్‌ఐ అశోక్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి ప్రమాదానికి కారణమైన సంతోష్‌ గౌడ్‌ను రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో భాగంగా సిద్దిపేట ప్రిన్సిపల్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ కోర్టు జడ్జి స్వాతిరెడ్డి ఇరువురి వాదనలు విన్న అనంతరం సంతోష్‌గౌడ్‌పై నేరం రుజువైనందున ఏడాది జైలు శిక్షణను విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా పోలీసులను ఎస్పీ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ మురళి

హవేళిఘణాపూర్‌(మెదక్‌): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్‌ మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మక్తభూపతిపూర్‌ గ్రామానికి చెందిన బందెవారి నర్సింలు (30) సోమవారం గేదెను కొనుగోలు చేశాడు. గేదెకు డబ్బులు చెల్లించాల్సి ఉండగా వారి బంధువులను అప్పు అడిగాడు. ఆ డబ్బులు ఇస్తానని చెప్పడంతో మెదక్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి డబ్బులు తీసుకొని బయల్దేరినానని చెప్పిన నర్సింలు కోంటూర్‌ చెరువు వద్ద శవమై కనిపించాడు. గ్రామస్తులు చూసి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని మెదక్‌ రూరల్‌ ఎస్‌ఐ మురళి పరిశీలించి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకున్నారు.

పోలీసులమని గొలుసు చోరీ

నిజాంపేట(మెదక్‌): మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నందిగామ గ్రామానికి చెందిన బలిజ లక్ష్మి, మల్లేశం దంపతులు బైక్‌ రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి వెళ్తున్నారు. గుర్తు తెలియని దుండగలు పోలీసులమని చెప్పి నందిగామ గ్రామ శివారులో వారి బైక్‌ ఆపారు. మహిళ మెడలో గొలుసు చూసిన దొంగలు 'గొలుసు మెడలో ఉంచుకోవద్దని, చోరీలు జరుగుతున్నాయని నమ్మించారు. ఆ గొలుసు తీసుకొని ఓ పేపర్‌లో చుట్టినట్టు చుట్టి కవర్‌ను మహిళకు ఇచ్చారు. దంపతులు ఆస్పత్రికి వెళ్లాక పేపర్‌ విప్పి చూడగా గొలుసు లేదు. గొలుసు విలువ 3 తులాల 2 గ్రాములు ఉన్నట్లు బాధితురాలు తెలిపారు. వెంటనే రామాయంపేట సీఐ వెంకటరాజ్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు



వెంకటేశ్‌ (ఫైల్‌)



రమేశ్‌ (ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ఒకరికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అభిమాన్‌ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం చిటుకుల్‌ గ్రామానికి చెందిన కూలీ పని చేసే వెంకటేశ్‌ (34) సోమవారం పని మీద ఇదే గ్రామానికి చెందిన రమేశ్‌ (35), మల్లేశ్‌ను బైక్‌ పై ఎక్కించుకొని ఇస్నాపూర్‌కు వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తున్నారు. ఎస్‌బీఐ బ్యాంక్‌ చౌరస్తాలో జాతీయ రహదారి దాటుతుండగా పటాచెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే లారీ వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు కింద పడిపోగా వెంకటేశ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన రమేశ్‌ను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్లేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి..

కల్హేర్‌(నారాయణఖేడ్‌): బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బీబీపేట శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కల్హేర్‌ ఎస్‌ఐ వెంకటేశం కథనం మేరకు.. బీబీపేట గ్రామానికి చెందిన మంగలి బాలరాజు(38) బైక్‌పై ఖానాపూర్‌(కె) వైపు బయల్దేరాడు. మార్గమధ్యలో బీరప్ప గుడి వద్ద బైక్‌ అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై బాలరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శివలీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.



బాలరాజు(ఫైల్‌)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

గజ్వేల్‌రూరల్‌: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని శ్రీగిరిపల్లి-పాతూరు రింగురోడ్డు బ్రిడ్జిపై చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసుల కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ(వేములఘాట్‌)కు చెందిన పుల్లయ్యగారి ప్రశాంత్‌(29)కు అక్కారానికి చెందిన భవానీతో వివాహం కాగా నాలుగేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు, ఏడాది కొడుకు ఉన్నారు. కొద్ది రోజుల కిందట భవానీ తల్లి గారింటికి వెళ్లగా ప్రశాంత్‌ వృద్ధ తల్లితో అక్కారంలోనే ఉంటున్నాడు. సోమవారం వేములఘాట్‌లోని ఇంటికి వెళ్లొస్తానని చెప్పి బయలుదేరాడు. తిరిగి రాత్రి అక్కారం వెళ్తుండగా శ్రీగిరిపల్లి-పాతూరు బ్రిడ్జి మధ్యలో రోడ్డుకు పక్కన ఉన్న సేఫ్టీ రాడ్స్‌కు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై ప్రశాంత్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.